# విమానాశ్రయాలకు ధీటుగా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ



## కేంద్ర రైల్వే కమిటీ చైర్మన్ పర్సన్ డాక్టర్ సిఎం రమేష్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 4, ప్రభాతవార్త
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్‌లో భాగంగా దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లను ఆధునికరించడం జరుగుతుందని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వేస్టేషన్లు కూడా కొత్త రూపును సంతరించుకోనున్నాయని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, కేంద్ర రైల్వే కమిటీ చైర్మన్ పర్సన్ డాక్టర్ సిఎం రమేష్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో కలిసి కేంద్ర రైల్వే కమిటీ సభ్యులు నేడు తిరుపతిలో సమావేశమై, తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించింది. ప్రయాణీకులకు మెరుగైన వసతులతో, అత్యున్నత ప్రమాణాలతో విమానాశ్రయాలకు ధీటుగా రాష్ట్రంలోని రైల్వే స్టేషన్‌లను తీర్చిదిద్దడం జరుగుతుందని, అవసరమైన ప్రదేశాలలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌బ్రిడ్జిల నిర్మాణం, ప్రజావసరాలకు అనుగుణంగా తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ సదుపాయం నిర్మించడం జరుగుతుందని ఈ పర్యటనలో రమేష్ వివరించారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ఆకట్టుకున్న లక్షదీపార్చన

## నారదపుష్కరిణిలో దీపాల వెలుగులు

## భక్తిపారవశ్యంలో భక్తులు



కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా దీపాలతో నారదపుష్కరిణిలో వెలుగులు



కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న బొజ్జలరిషితారెడ్డి

శ్రీకాళహస్తి, నవంబర్ 4 ప్రభాతవార్త
కార్తీక మాసం సందర్భంగా తొలిసోమవారం పట్టణంలోని నారద పుష్కరిణిలో దేవస్థానం లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఎంఎల్‌ఏ దంపతులు బొజ్జవెంకటసుధీర్‌రెడ్డి, బొజ్జలరిషితారెడ్డిలు హాజవగా వీరికి ఇఓ బాపిరెడ్డి, ఎఈఓ ఎన్ఆర్.కృష్ణారెడ్డి, ఆలయాధికారులు స్వాగతం పలికారు. అనంతరం నారదపుష్కరిణిలో బొజ్జలరిషితారెడ్డి కార్తీక దీపం వెలిగించారు. ఆమెతో పాటు పలువురు భక్తులు హాజరై దీపాలు వెలిగించడంలో కార్తీకమాసం ఎంతో భక్తిశ్రద్ధలతో ఉండాలని ఆధ్యాత్మిక చింతనతో పలు ప్రాంతాల నుంచి ఇక్కడ దీపాలువెలిగించడానికి వస్తుంటారని వారిని భక్తిభావంతో సిబ్బంది ఉండాలన్నారు. కాగా ఎంఎల్ఏతో పాటు ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి, ఇఓ బాపిరెడ్డి దంపతులు కార్తీక దీపాన్ని వెలిగించారు. కార్యక్రమాల్లో పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

# తిరుపతికి వరద ముప్పు తప్పదా!?

## ఆక్రమణల్లో కాలువలు
## గుంటల్లో కాలనీలు





ప్రభాతవార్త-తిరుపతి:
20నిమిషాలు, అర్ధగంట సమయం బలమైన వర్షం కురిస్తేనే తిరుపతినగరంలోని ప్రధాన రోడ్లు మినీచెరువులుగా కనిపిస్తాయి. అలాంటిది 24గంటలు ఏకధాటిగా అతి భారీ వర్షమొస్తే తిరుపతి పరిస్థితి ఏంటనేది ఇప్పుడు అందరిలోనూ ఆలోచనకు దారితీస్తోంది. వరుసగా రెండు రోజులు భారీ వర్షాలు కురిస్తే తిరుపతిలో వరదనీరు ప్రవహించలేని దుస్థితి ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త.ప్లాస్టిక్ కవర్లతో ప్రధాన మురికికాలువలు పేరుకుపోవడం, కాలనీల్లో మురికినీటి కాల్వలు చాలావరకు వెడల్పులేకపోవడం వంటి ప్రధాన సమస్యలు నేటికీ ఎదురవుతున్నాయి. కుచించికుపోయిన కాల్వలు, ప్లాస్టిక్‌తో పేరుకుపోయిన కాల్వలతోప్రమాదం తప్పదనే సంకేతాలు ,హెచ్చరికలు ఉన్నాయి. ఈ విషయం ఇప్పుడు అటు నగరవాసులను, ఇటు నగరపాలక అధికారులను కలవరపరుస్తోంది. రెండునెలల క్రిందట విజయవాడనగరంలో వరదలకు నీరు రోడ్లపై మనిషిలోతులో నిల్వతో ఇళ్ళన్నీ నీళ్ళలోనే ఉండటం విన్నాం. ఈ నేపధ్యంలో తిరుపతిపుణ్యక్షేత్రంలో కూడా వరదనీటితో ముప్పు తప్పదనే ఆందోళన సీనియర్ సిటిజన్లు, పర్యావరణ శాస్త్రవేత్తల్లో వ్యక్తమవుతోంది.
ఆధ్యాత్మిక నగరంగా విరాజిల్లుతున్న తిరుపతికి వరదముప్పు పొంచి వుందా!? భారీగా వరదలు వచ్చి ఊహించనిరీతిలో వర్షాలు కురిస్తే పరిస్థితిని ఎవరూ అంచనా వేయలేరు. నగరంలో చాలావరకు కాలనీలు మురికికాల్వలు ఆక్రమణలకు గురవడం, కాల్వలపైనే అపార్టుమెంట్లు నిర్మించేయడం, చెరువులు,గుంటల ప్రాంతాల్లో కాలనీలు ఏర్పడి భవనాలు వెలిశాయి. దీంతో వరదనీరు బయటకు వెళ్ళలేని పరిస్థితి ఉంది. మూడేళ్ళ క్రిందట తిరుపతినగరంలో కురిసిన భారీ వర్షాలకు పాత రేణిగుంటరోడ్డు, తిరుచానూరురోడ్డు, లక్ష్మీపురంకూడలి ప్రాంతాల్లో ప్రధాన రోడ్లు మినీచెరువులుగా దర్శనమిచ్చాయి. వరదనీరు బయటకు వెళ్ళే అవకాశం లేక నిలచిపోవడం, వరదనీటి కాల్వలో ఓ ప్రైవేటు ఉద్యోగి కొట్టుకుపోవడం ,చివరకు మృతదేహంగా తేలడం వంటి దుర్ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇంకా పలుప్రాంతాల్లో ఇళ్ళు గోడలు పడి ,నేలకూలిపోయాయి. సరిగ్గా పదేళ్ళక్రిందట తిరుపతి నగరంలో భారీగా కురిసిన వరదలకు నగరం జలమయంగా మారింది. రోడ్లు,కాలనీలు పూర్తిగా నీటితో నిండిపోయాయి. అప్పట్లోనే మురికినీటి కాల్వల ఆక్రమణలపై, వరదనీరు సక్రమంగా ప్రవహించేందుకు చర్యలు చేపట్టేప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాల్వల ఆక్రమణలు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. అయితే అవి కార్యరూపం దాల్చలేదు. వరదలొస్తే మాత్రం తిరుపతి నగరంలో పరిస్థితి ఏంటనేది ఇప్పుటు అందరిలోనూ ఆలోచన చేయాల్సి వస్తోంది. తిరుపతినగరంలో ప్రధానంగా శేషాచలంకొండల్లో తిరుమల అడవులపైనుంచి వచ్చే వరదనీరు కపిలతీర్థం నుండి తిరుపతి కెటిరోడ్డు, అన్నారావుకూడలి, ఖాదీకాలనీ, అక్కారాంపల్లి మీదుగా వెళ్ళేందుకు 60అడుగుల నీటికాల్వ ఉండేదని,ఆ కాల్వ ఇప్పుడు పూర్తిగా ఆక్రమణలకు గురై పోవడంతో వరదనీరు ప్రవహించలేని దుస్థితిలో ఉంది. తిరుపతినగరంలో దాదాపు 16చెరువులు పూర్తిగా కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయి పెద్దపెద్ద భవనాలు, అపార్టుమెంట్లుగా మారిపోయాయి. వరదలు వస్తే తిరుపతి నగరం ముప్పుఉందనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. నగరంలో డిఆర్‌మహల్‌రోడ్డు, ఆర్‌సిరోడ్డు, ఎంఆర్‌పల్లి, గాంధీరోడ్డు, బండ్లవీధి, కెటిరోడ్డు, ఏఐఆర్‌బైపాస్‌రోడ్డు, పెద్దకాపులేఔట్ , తాతయ్యగుంటకట్ట, తుడ కార్యాలయం వెనుక వైపు, ఇంకా లోతట్టు కాలనీలు వరదనీటికి గురయ్యే ప్రమాదం వుంది.

# కాణిపాకంలో కార్తీక దీపారాధన



కాణిపాకం, నవంబర్ 4 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీకమాసం మొదటి సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం శివాలయాలలో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈమేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వ రాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాణిపాకం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున దీపారాధన కోసం తరలిరావడంతో మణికంఠేశ్వరాలయం మహిళా భక్తుల రద్దీ నెలకొంది. ఇదిలా వుండగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# హోటల్‌లో అధికారుల తనిఖీలు

## ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అన్వేష్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 4, ప్రభాతవార్త
నగర పాలక పరిధిలోని స్పైసీ పారడైజ్ హోటల్‌లో నగర పాలక సంస్థ ఫుడ్ సేఫ్టీ అధికారులు కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశాల మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని గాంధీ విగ్రహం సమీపంలోని స్పైసి ఫారడైజ్ హోటల్ పై వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీ చేసి తాత్కాలికంగా మూసివేసామని అన్నారు. సోమవారం మధ్యాహ్నం తమ సిబ్బందితో పాటు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌తో కలిసి హోటల్‌ను తనిఖీ చేశామని అన్నారు. హోటల్‌లో అపరిశుభ్రంగా ఉండదు స్టాక్ వద్ద భారీ సంఖ్యలో బొద్దింకలు ఉండడం, సేఫ్టీ నమూనాలు పాటించకపోవడం గుర్తించామని అన్నారు. ఆ మేరకు ప్రతినెలా పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, గోడుల ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, కిచెన్ నందు మూతలు కలిగిన పాత్రలు వాడాలని సూచించామని అన్నారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, పంట మనుషులు, పనిచేయువారు ఎలాంటి అంటూ వ్యాధులు లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు పొందాలని సూచించామని అన్నారు. స్టాకు కొన్నప్పుడు, వినియోగించినప్పుడు స్టాక్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని నగర పాలక సంస్థ లైసెన్సులు ఫుడ్ లైసెన్సులు కనపడే విధంగా ఉంచాలని తెలిపామని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన ఫుడ్ అందించాలని అన్నారు. తనిఖీలు కనుగొన్న లోపాలను సరిదిద్దుకోవాల్సిందిగా నోటీసులు ఇచ్చామని అన్నారు. వారు హోటల్ నందు తనిఖీల్లో తెలిపిన లోపాలను సరిదిద్ది తిరిగి తెరుచుకునేందుకు అనుమతి ఇస్తామని హెల్త్ ఆఫీసర్ తెలిపారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

## అమ్మవారి బ్రహ్మోత్సవాల
# బుక్ లెట్ ఆవిష్కరణ

తిరుచానూరు, నవంబర్ 4, ప్రభాతవార్త



తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 28 నుండి డిసెంబర్ 6వ తేది వరకు జరుగనున్న రోజువారి కార్యక్రమాల బుక్ లెట్‌ను సోమవారం తితిదే ఈవో శ్యామల రావు ఆవిష్కరించారు. తిరుపతి పరిపాలనా భవనంలో సోమవారం తితిదే ఈవో తన కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ నవంబర్ 28 నుండి డిసెంబర్ 6వ తారీకు వరకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా నవంబర 28వ తారీకు ధ్వజారోహణంతో ప్రారంభమై డిసెంబర్ 2వ తారీకు గజవాహనం, 4వ తారీకు బంగారు రథం, 5వ తారీకు రథోత్సవం, 6వ తారీకు ప్రధానమైన పంచమీతీర్థం నిర్వహించనున్నారని తెలిపారు. అమ్మవారి భక్తులు ఈ బ్రహ్మోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ పద్మావతి అమ్మవారి కరుణాకటాక్షాలకు పాత్రులు కాగలరి భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తితిదే జేఈవో వీరబ్రహ్మాం, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. వాహనసేవల వివరాల నవంబర్ 28 ఉదయం ధ్వజారోహణం, రాత్రి చిన్న శేషవాహనం, 29 ఉదయం పెద్దశేషవాహనం, రాత్రి హంసవాహనం, 30వ తారీకు ఉదయం ముత్యపుపందిరి వాహనం, రాత్రి సింహవాహనం, డిసెంబర్ 1 ఉదయం కల్పవృక్షం వాహనం, రాత్రి హనుమంతవాహనం, 2వ తారీకు ఉదయం పల్లకి ఉత్సవం, వసంతోత్సవం, రాత్రి గజవాహనం, 3వ తారీకు ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం స్వర్ణ రథం, రాత్రి గరుడవాహనం, 4 వ తేది ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 5వ తారీకు ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 5వ తేది ఉదయం పంచమితీర్థం, రాత్రి ధ్వజారోహణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# వెందోడు రైల్వే స్టేషన్‌లో రైళ్లను ఆపాలి

## స్టాండింగ్ కమిటీని కోరిన ఎంపి గురుమూర్తి



బాలాయపల్లి, నవంబర్ 4, ప్రభాతవార్త
కోవిడ్ సమయంలో స్టాపింగ్ ఎత్తివేసిన బాలాయపల్లి మండలం వెందోడు రైల్వే స్టేషన్‌లో రైలు నంబర్లు 17405/17406 కృష్ణా ఎక్స్‌ప్రెస్, 17480/17489 తిరుపతి - పూరి - తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని పార్లమెంట్ స్టాండ్ కమిటీ చైర్మన్ ఎంపి గురుమూర్తి కోరారు. దక్షణ రైల్వే జోన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్‌లో చెన్నై ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 12604), నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు 12655/56) కాకినాడ పోర్ట్ - చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 17644) నిలుపుదల కోసం కోరడం జరిగింది. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించవల్సిందిగా కోరారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి రేణిగుంట నుంచి గూడూరు, తిరుపతి నుండి రేణిగుంట మధ్య 3వ లైన్ అభివృద్ధి ఎంతో అవసరం. ఈ మార్గంలో ప్రయాణికులు రద్దీ ఎక్కువగా వుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య రైళ్లు ఎక్కువగా నడపబడుతున్నందున, మూడు లైన్ సులభతరమైన కార్యకలాపాలను అనుమతిస్తుంది, నిరీక్షణ సమయం, ఆలస్యాన్ని తగ్గిస్తుంది. రేణిగుంట రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలి. గూడూరులోని అంబేద్కర్ నగర్ సమీపంలో 1,2 పట్టణాలను కలిపే అండర్ పాస్ వెంకటగిరి, రాజంపేట, రాపూరు, పొదలకూరు వంటి పట్టణాలకు ప్రయాణించేందుకు ప్రధాన మార్గంగా ఉంది. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నందువలన ఇరుకుగా ఉన్న ఈ అండర్‌పాస్‌ను సాఫీగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారికి తెలియజేశారు. అలాగే తిరుపతి - కాట్పాడి మార్గాన్ని డబల్ లైన్ చేయాలనీ ప్రతిపదించడం జరిగింది. రేణిగుంట రైల్వే స్టేషన్ తిరుపతికి సేవలందించే ఒక ప్రధాన జంక్షన్, రేణిగుంట స్టేషన్‌కి తిరుపతి ఈస్ట్ స్టేషన్‌గా పేరు మార్చడం, కమిటీ దృష్టికి తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి తీసుకెళ్లారు.

# నాగమ్మ..కరుణించవమ్మా..!

## -నేడు నాగులచవితి

తొట్టంబేడు, నవంబర్ 4 ప్రభాతవార్త



దీపావళి అమావాస్య వచ్చే కార్తీక శుద్ధ చతుర్ధిని నాగులచవితి పండుగ అంటారు. కొందరు శ్రావణ శుద్ధ చతుర్ధినాడు జరుపుకుంటారు. ప్రకృతి మానవ మనుగడకు జీవనాధారమైనది కనుక దానిని దైవస్వరూపంగా భావించి మనపూర్వీకులు చెట్టును, పుట్టను, రాయి, రప్పను, కొండ, కోన, నదులను, పర్వతాలను ఇలా సమస్త ప్రాణకోటికి దైవస్వరూపంగా చూసుకుంటూ పూజిస్తున్నారు. ఇదే మన భారతీయ సంస్కృతి, సంప్రదాయం. ఇందులో భాగంగానే నాగుపామును కూడా నాగరాజు,నాగదేవతగా పూజిస్తూ వస్తున్నారు. మన పురాణాల్లో నాగులచవితి గురించి ఎన్నో గాధలు ఉన్నాయి. దేశమంతట పలు దేవాలయాల్లో మెలికలతో ఉన్న నాగేంద్రుని విగ్రహాలు కనిపిస్తుంటాయి. ఈ నాగులచవితినాడు నాగేంద్రుని భక్తిభావంతో అర్చిస్తే సర్వరోగాలు హరించి సౌభాగ్యవంతులవుతారని భారతీయుల నమ్మకం. నాగుల చవితి రోజున ప్రత్యక్ష్యంగా పుట్టలను ఆరాధించి పుట్టలో పాలు పోస్తే మానవునిలో ఉన్న విషసర్పం కూడా శ్వేతతత్వం పొంది, అందరి హృదయాల్లో నివసించే శ్రీమహావిష్ణువునకు తెల్లని ఆదిశేషువుగా మారి శేషపాన్పుగా మారాలని కోరికతో చేసేదే. ఈరోజున పుట్టలో పాలుపోసి నాగపూజ చేసి చలిమిడి, చిమ్మిలి, అరటిపళ్ళు, తేగలు తదితరాలు నివేదన చేస్తారు. సన్నిధివీధిలోని జలవినాయకుని సమీపంలో ఉన్న నాగులవిగ్రహాలకు పూజలు చేసేందుకు నేడు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా ముత్యాలమ్మగుడి, ఏడుగంగమ్మలగుడి, అంకాళమ్మగుడి, బంగారమ్మకాలనీ సమీపంలోను, దక్షిణకాళీమాతా ఆలయం ఆవరణలో ఉన్న నాగులపుట్ట వద్ద నేడు నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

# పాలకులూ..మా గోడు పట్టించుకోరా....

## అరకొర వసతులతో అద్దె భవనంలో బీసీ హాస్టల్
## న పునాదులకే పరిమితమైన నూతన భవనం



అప్పటి మంత్రి చెంగారెడ్డి ప్రారంభించిన శిలాఫలకం

విజయపురం, నవంబరు 4 ప్రభాతవార్త:
పాలకులూ..మా గోడు పట్టించుకోరా....మాకు ఏ నాటికి మోక్షం కలుగుతుంది అంటూ విజయపురం బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. 100 మంది విద్యార్థులు నివాసం ఉండే వసతి గృహంలో ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 7కు చేరింది. కనీస వసతులు కరువై పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయపురంలో బీసీ బాలుర వసతిగృహం మంజూరైందని అప్పటిమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి 9.8.2008న విజయపురం పోలీస్‌స్టేషన్ ఆవరణలో శంకుస్థాపనచేశారు. శంకుస్థాపన చేసి 16 సంవత్సరాలు కావస్తున్నా నేటికి పునాదుల స్థాయి దాటడం లేదు. 16 సంవత్సరాల కాలంలో మూడు పర్యాయం ప్రభుత్వాలు మారినా. .ముగ్గురు ప్రజాప్రతినిధులు మారినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం అద్దె భవనంనడుస్తున్న వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. వసతి గృహంలో అరకొర వసతులతో బాతురూం, కూలిపోయే స్థితిలో ఉన్న వంట గది పైకి ఎక్కలేని స్థితిలో మెట్లు, పంచాయతీ నీటితోనే సరిపెట్టుకఉంటున్న తాగునీటి వసతి వంటి అంశాలు కలచి వేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వసతి గృహానికి వచ్చే విద్యార్థులు సౌకర్యం లేమితో వేరే హాస్టల్‌కు చేరుకుంటున్నారని, ఉన్న వారు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జంబాడలో సొంత భవనం ఉన్నా విద్యార్థుల లేమితో కొట్టు మిట్టాడుతున్నాయి. వీటిపై పాలకులు, అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.





విజయపురంలో అరకొర వసతులతో అద్దె భవనంలో నడుస్తున్న వసతి గృహం

విజయపురంలో పునాదులకే పరిమితమైన వసతి గృహ నిర్మాణం(ఫైల్‌ఫోటో)

### న పునాదికి వేసిన కమ్మీలను సొమ్ము చేసుకున్న వైసీపీ నాయకులు..?

పునాదికి వేసిన కమ్మీలను వైసీపీ నాయకుడు సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. జగనన్న గృహ నిర్మాణం జరుగుతున్న సమయంలో వైసీపీ నాయకుడు కమ్మీలను కట్ చేసి సొమ్ము చేసుకున్నారని, కొన్ని కమ్మీలను సొంత ఇంటి నిర్మాణాలకు వినియోగించుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న కమ్మీలను దొంగతనం చేయడంపై పలువురు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపణలు చేస్తున్నారు. కమ్మీలను దొంగతనం చేయడంతో పునాది పశువుల పాకగా మారింది. ఈ విషయమై సమగ్ర విచారణ నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

పుంగనూరు, నవంబరు 4 ప్రభాతవార్త :

మండలంలోని పత్రపల్లి గ్రామానికి చెందిన రాధమ్మ అనే వివాహిత సోమవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన రాజప్ప భార్య అయిన రాధ కుటుంబ ఘర్షణల కారణంగా క్రిమిసంహారక మందు తాగిందని, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆమెను చికిత్సనిమిత్తం తరలించి, కేసు నమోదు చేశారు.



## భక్తిశ్రద్ధలతో కేదారీ నోములు

చౌడేపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో కేదారీ నోములను భక్తి శ్రద్ధలతో జరపుకొన్నారు. కార్తీక సోమవారంను పురష్కరించుకొని ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌లు స్వామివారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. మండలంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కేదారీ నోములను నోచుకొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.

## సొంతనిధులతో పిచ్చిమెక్కలు తొలగించిన తెదేపా నాయకులు

పెద్దపంజాణి నవంబర్4 ప్రభాతవార్త :



మండలంలోని ముత్తుకూరు పంచాయతీ ముత్తుకూరు క్రాస్‌నుంచి ముత్తుకూరు గ్రామంలోకి వెళ్ళేరోడ్డులో ఇటీవలకాలంలో రోడ్డుపక్కన పిచ్చిమెక్కలు ఏపుగాపెరిగి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు సైతంచోటుచేసుకునేవి. ఈ విషయం గుర్తించిన ముత్తుకూరు చెందిన టిడిపినేత మంజునాథ్ పలువురునేతలు తమసొంత ఖర్చులు వెచ్చించి సోమవారం జెసీబీ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమెక్కలను తొలగింపజేశారు. ప్రజలు దేశం నాయకులకు అభినందనలు తెలిపారు.

## మండలంలో నైపుణ్యాభివృద్ధి సర్వే విజయవంతం చేయాలి

### - ఎంపీపీ రెడ్డెప్ప.

పెద్దపంజాణి నవంబరు4 ప్రభాతవార్త :



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న స్కిల్ సెన్సెస్(నైపుణ్యాభివృద్ధి) సర్వేను గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ రెడ్డెప్ప ఆదేశించారు. సోమవారం మండలకార్యాలయలంలో జరిగిన శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధిఅవకాశాలు కల్పించేనిమిత్తం తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్‌సెన్సెస్ సర్వే చేపడుతుందన్నారు. 15-59 ఏళ్ళలోపుఉన్న స్త్రీ పురుషులు ఏఏరంగంలో ఏమేర నైపుణ్యం కలిగిఉన్నారో ఈ సర్వేద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. అనంతరం వారికి వారినైపుణ్యం చూపినవృత్తిలో తగుశిక్షణకల్పించి ఉపాధి అవకాశాలుకల్పించేందుకు ప్రభ్వుం చర్యలుతీసుకుంటోందన్నారు. సర్వేను ప్రణాళికాబద్దంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బాలాజి, ఈఓపిఆర్‌డి శారదదేవి, రిసోర్స్ పర్సన్ హరిబాబు, డిజిటల్ అసిస్టెంట్ జయచంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐరాల జూనియర్ కాలేజిలో విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు




ఐరాల, నవంబర్ 4 ప్రభాతవార్త: మండల కేంద్రం ఐరాల ప్రభుత్వ జూనియర్ కాశలలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ పూర్ణలత, డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక శిభిరాన్ని ఏర్పాటు చేసి బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.రెడ్డిరామరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయకుమార్, వైద్యసిబ్బంది చిన్నమ్మ, జ్యోతి, అరుణ, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలు.. ప్రాణదాతలు

### - ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్



రామకుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త

రక్తదాతలు ప్రాణదాతలు అని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మూడు వేలమందికి రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ తరపున రక్త దానం చేయడం గొప్ప విషయమన్నారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింతగా పాలుపంచుకుని ఆపదలో ఉన్న వారి ప్రాణాలు నిలపాలని సూచించారు. కార్యక్రమాల్లో ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, కుప్పం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, పిఇఎస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీసద్గురు యోగి నారేయణ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ



కుప్పంరూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త

కుప్పం పాతపేట చెరువు సర్కిల్‌లో కైవారం ట్రస్ట్ అధ్వర్యంలో శ్రీ సద్గురు యోగి నారేయణ విగ్రహ ప్రతిష్టకు సోమవారం ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంలు భూమిపూజ చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ కైవారం ట్రస్ట్ ద్వారా కుప్పంలో యోగి నారేయణ విగ్రహం ఏర్పాటుచేయడం శుభపరిణామమన్నారు. పార్టీ తరపున విగ్రహం ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా బాగుండాలని ఆశీస్సులు అందించిన మహనీయుడు కైవారం తాతయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు ప్రభాకర్, ఆర్ముగం, వెంకటేష్, కౌన్సిలర్ సోమశేఖర్, గంగమ్మ గుడి మాజీ డైరెక్టర్ మంజునాథ్, జనసేన నరేష్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ

వి.కోట, నవంబర్ 4 ప్రభాతవార్త

వి.కోట మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మంగళవారం నుంచి పంచాయతీల్లో సామాజిక తనిఖీలు జరుపుతున్నట్లు ఎపిఓ అశోక్‌రెడ్డి తెలిపారు. మండలంలో 8.93 కోట్లతో ఉపాధిహామీ పనులు 2023-24 సం॥లో చేపట్టినట్లు తెలిపారు. సామాజిక తనిఖీకి రైతులు, కూలీలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి బుజ్జి, సామాజిక తనిఖీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా శాశ్వత సభ్యత్వం పొందిన పిఎస్ మునిరత్నం

### - లక్ష రూపాయల చెల్లింపుతో లైఫ్‌టైం మెంబర్‌షిప్ !!




కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త

ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం పొందారు. ఈమేరకు ఆయన పార్టీ సభ్యత్వ నమోదు రుసుం కింద లక్ష రూపాయలు ఆయన చెల్లించారు. ఈసందర్భంగా వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో తాను ముందుకుసాగుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ తరపున శాశ్వత సభ్యత్వం పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని అలాంటి కార్యకర్తల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు చొరవ చూపుతున్నారన్నారు. 100రూ.ల సభ్యత్వం పొందే కార్యకర్తలకు ప్రమాద భీమాగా 5లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే అంత్యక్రియల ఖర్చులకు పదివేల సాయం అందిస్తారన్నారు. ఇది మరే పార్టీలో కూడా లేదన్నారు. సభ్యత్వ నమోదును కుప్పంలో పండగ వాతావరణంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధచూపండి

పాకాల, నవంబర్ 4, ప్రభాతవార్త




చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా. ఎ. మొహిద్దిన్ భాషా మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. బోధన, పరీక్షల గురించి వివరించారు. అదే విధంగా బాలికల జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు బేబీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలు ఇంటికి రాగానే ఇవాళ పాఠాలు ఏమి జరిగాయి? ఏమి చదువుతున్నారు అని తల్లిదండ్రులు అడగాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ హాజరు, పరీక్షల్లో సాధించిన మార్కుల గురించి అధ్యాపకులు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్. వీరమేశ్ కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ ఈశ్వర్ బాబు, అధ్యాపకులు, తల్లిదండ్రులు హాజరైయ్యారు.

## సమగ్రంగా నైపుణ్య గణన-2024 నిర్వహించాలి

తవణంపల్లె, నవంబర్ 4 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నైపుణ్య గణన-2024ను మండలంలో సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ రెడ్డిబాబు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నైపుణ్య గణన-2024 పై మండ లంలోని గ్రామ సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి 15 నుండి 59 ఏళ్ళు వయస్సు గల వారికి సంభందించిన వివరాలను గణన చేసి నైపుణ్యం యాప్ నందు అప్‌లోడ్ చేయాలన్నారు. ఈమేరకు వారికి సంభందించిన విద్యార్హతలు, నివాసం, ఉద్యోగం, శిక్షణ తదితర తొమ్మిది రకాల వివరాలను యాప్‌లో పొందు పరచాలన్నారు. ఈసమావేశంలో ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి. జడ్పీటీసీ భారతిమధుకుమార్, ఈఓపీఆర్డీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్దురాలి రేకుల ఇంటిని కూల్చేశారు.

పెద్దపంజాణి నవంబర్4 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండలంలోని పెద్దారికుంట పంచాయతీ చిన్నారికుంట గ్రామానికి చెందిన చెంగమ్మ(60)అనే వృద్దురాలు నివాసముంటున్న రేకుల ఇంటిని గ్రామానికి చెందిన కొంతమంది కూల్చేశారని చెంగమ్మ కోడలు అమరావతి సోమవారం పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనఅత్త చెంగమ్మ గ్రామంలో ఉన్న గ్రామకంఠం స్థలంలో సుమారు ఐదేళ్ళుగా రేకులఇంటిని నిర్మించుకునివాసముంటుందన్నారు. అయితే ఈ స్థలంపై కన్నేసిన కొంతమంది సోమవారం చెంగమ్మ ఉంటున్న రేకుల ఇంటిపైకప్పులు మెస్ ఇంటిసామాగ్రి విద్యుత్‌సర్వీసు తదితరాలు తెంచి బయటపడేసారన్నారు. ఈ సందర్భంగా మీ అంతుచూస్తామంటూ తనఅత్తను బెదిరింనట్లు సైతం ఆమె ఫిర్యాదులో పేర్కొంది. అనాదిగా తన అత్తచెంగమ్మ ఉంటున్నఇళ్ళు తమ పూర్వీకులనుంచి అనుభవం ఉందని ఈ నేపథ్యంలో తమపై కొంతమంది దౌర్జన్యంచేసి స్థలం ఆక్రమించుకోవాలని దాడులకు తెగబడడం జరిగిందన్నారు. ఈ విషంగా తమకు పోలీసులు, సంబంధిత అధికారులు తగు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అరవపాలెం ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

చిట్టమూరు, నవంబర్ 4 ప్రభాతవార్త

చిట్టమూరు మండలం అరవపాలెం సచివాలయ ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా మల్లాంలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును నియమించినట్లు ఎంపిడిఓ మనోహర్‌గౌడ్ తెలిపారు. అరవపాలెం ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ధనలక్ష్మిని యల్లసిరికే పరిమితం చేసి వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. గతంలో వెంకటేశ్వర్లు ఇఓపిఆర్‌డిగా కూడా బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించడంతో ఆయనను మరోమారు అరవపాలెం సచివాలయానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి

డక్కిలి, నవంబరు 4 ప్రభాతవార్త;

ఎరువులు దుకాణాల యజమానులు రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన వెంటనే వారికి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని డక్కిలి వ్యవసాశాఖ అధికారి విజయభారతి తెలియజేశారు. సోమవారం ఆమె డక్కిలిలోని పలు ఎరువులు దకాణాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా దకాణాల యజమానులకు పలు సూచనలు ఇచ్చారు. విత్తనాలు, మందులు, ఎరువులు నిర్దేశించిన ధరలకే విక్రయించాలి తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధరలు తప్పనిసరిగా పట్టికలో నమోదు చేయాలన్నారు. అంతకు ముందు ఆమె స్థాకు రిజిష్టరు, బిల్లు పుస్తకాలు పరిశీలించారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఫ్యాకల్టీ శిక్షణ తరగతులు ప్రారంభం

కోట, నవంబర్ 4 ప్రభాతవార్త




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎద్యుకేషన్ వారి సౌజన్యంతో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అటల్ అధ్యాపక శిక్షణ తరగతులు అప్లికేషన్స్ ఆఫ్ ఫైనేట్ ఎలిమెంట్ అనాలసిస్ ఇన్ ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ అనే అంశంపై ప్రారంభించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఆరురోజుల పాటు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటి తిరుపతి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రవిశంకర్ పాల్గొని మాట్లాడుతూ 3డి ప్రింటింగ్ తయారీ యుగం భవిష్యత్తుగా మారబోతోందని తెలిపారు. వివిధ రకాల పదార్థాలకు సరిపోయే విభిన్న ప్రక్రియల ద్వారా ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఐఐటి మద్రాస్ ఆచార్యులు డాక్టర్ శివ శ్రీనివాస్ దేవాదుల మాట్లాడుతూ 3డి ప్రింటింగ్ రంగంలో పరిశోధకులకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. విభాగాధిపతి డాక్టర్ సిహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల్లో వివిధ ఐఐటి ఎన్ఐటి అధ్యాపకులు, పారిశ్రామిక నిష్ణాతులుతమ అనుభవాలు పంచుకుంటారని తెలిపారు.

## కోటలో ఎరువుల దుకాణాలు తనిఖీ

కోట, నవంబర్ 4 ప్రభాతవార్త



కోట మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయాధికారి నిరంజన్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు విత్తనాల నాణ్యతను పరిశీలించాలని ఆయన సూచించారు. కోటలోని పలు షాపులను ఆయన తనిఖీలు చేశారు. రైతులు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా దుకాణాల్లో ఎంతమేరకు స్టాకు ఉందో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

## కార్యదర్శి నిర్లక్ష్యంతో సిబ్బందికి అందని వేతనాలు

చిట్టమూరు, నవంబర్ 4 ప్రభాతవార్త

చిట్టమూరు మండలం అరవపాలెం సచివాలయ కార్యదర్శి ధనలక్ష్మి నిర్లక్ష్యంతో నవంబర్ నెలకు సంబంధించి ఉద్యోగులకు జమ కావాల్సిన జీతాలు ఆగిపోయాయి. సచివాలయంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించిన కార్యదర్శి సురేష్‌బాబు, అరవపాలెం నుంచి బదిలీపై వెళ్లడంతో గూడూరు నుంచి అరవపాలెం కార్యదర్శిగా, అరవపాలెం సచివాలయ ఇన్‌ఛార్జ్‌గా డిడిఓగా ధనలక్ష్మి అక్టోబర్ 6వ తేదీన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అయితే సచివాలయ సిబ్బందికి 25వ తేదీలోపు డిజిటల్ సహాయకుల చేత వేతనాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ డిడిఓగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై ఉంది. అయితే ఆమె సిబ్బందికి వేతనాలను సకాలంలో అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

### సచివాలయానికి వచ్చేదే అంతంతమాత్రం..

అరవపాలెం సచివాలయ నూతన కార్యదర్శిగా అక్టోబర్ 6వ తేదీన బాధ్యతలు చేపట్టిన ధనలక్ష్మి ఇప్పటివరకు కేవలం రెండుసార్లు మాత్రమే కార్యాలయాన్ని సందర్శించినట్లు తెలుస్తోంది. సచివాలయంలో సిబ్బందిని సమన్వయం చేసుకోవడంతో పాటు వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరించాల్సిన ఆమె తూతుమంత్రంగా కార్యాలయానికి రావడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు ఇంటిపన్నులు, గ్రామాల్లో శానిటేషన్ వంటి సేవలను త్వరితగతిన అందించాల్సిన కార్యదర్శి కార్యాలయానికి ఎప్పుడు వస్తుందో, వెళుతుందో తెలియని అయోమయ పరిస్థితి. అధికారులు స్పందించి అరవపాలెం సచివాలయంలో బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## చెరువులో వ్యర్ధాలు కలిపిన వారిపై చర్యలు తీసుకోవాలి: రైతు సంఘం డిమాండ్




చిల్లకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త

చిల్లకూరు మండలం కడివేడు గ్రామ రెవెన్యూ చెరువులో పోర్టు నుండి వ్యర్థాలు తెచ్చి కలుపుతున్న సన్నిబోయిన హరినాథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సి. హేమలత మాట్లాడుతూ కడివేడు, గ్రామ సమీపంలో నల్లటి కెమికల్స్‌తో కూడిన వ్యర్థాలను పెద్ద పెద్ద బ్యారెల్స్ ద్వారా లారీల ద్వారా తెచ్చి పోయడంతో అవి పంటకాలవల ద్వారా చెరువులోకి ప్రవేశించి తెల్లగా ఉండే నీళ్ల నల్లటి రూపంతో చెరువులో ప్రవేశించడంతో చెరువులో ఉన్న చేపలు చనిపోవడం అవి తిన్న గ్రామ ప్రజలు అనారోగ్య పాలు కావడం ఆసుపత్రిలో చేరడం, ఆ చెరువులో నీళ్లు తాగిన నోరులేని మూగజీవాలు పశువులు, మేకలు, గొర్రెలు, అక్కడికక్కడే మరణించడం వంటివి జరుగుతున్నాయని తెలిపారు. గతంలో 8.5.2023వ తేదీన పై సమస్యపై ఆ గ్రామ రైతులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి గూడూరు ఆర్డిఓకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అయినా సంబంధిత అధికారులలో స్పందన లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలయిన కడివేడు, కమ్మవారిపాలెం, తిమ్మనగారి పాలెం, ముత్యాలపాడు, గ్రామాలకు చెందిన సుమారు 1500 ఎకరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని పోవడంతో పంటల సాగుబడిని రైతులు ఆపివేయడం జరిగిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ ఈ విషయం పరిశీలించి చెరువుని నాశనం చేయుటకు, చెరువు నీరుతో సాగు చేసుకుని రైతుల నాశనానికి పూనుకుంటూ ఉన్న సన్నిబోయిన హరినాథ్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని కాలుష్యంలో ఉన్న పై గ్రామాల రైతులు సాగుబడి చేసుకునే విధంగా నేటిని అందించాలని వ్యర్థాలతో కూడిన కెమికల్స్‌ను కలిపిన అతని చేతే చెరువుని శుద్ధి చేయించి, డ్యాములు ద్వారా కొత్త నీటిని పారుదల చేసి రైతులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తల్లంప్రసాద్, పెనుబోలు సాయి రెడ్డి అభిలాష్ రెడ్డి, తిరుపతి శీనయ్య, సుమన్ రెడ్డి, వి. గజేంద్ర నాయుడు, పెంచలయ్య, ఎదనపర్తి కృష్ణారెడ్డి, రాధాకృష్ణ, కిరణ్, శీనయ్య, చంద్రమోహన్, నాయకులు బివి రమణయ్య, ఎస్. సురేష్, పి. శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ముత్యాలయ్య, బి. చంద్రయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

### ఏడిఏ నాగార్జున సాగర్

వెంకటగిరి, నవంబర్ 4, ప్రభాతవార్త



అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటా మని ఏడిఏ ఎం. నాగార్జున సాగర్ హెచ్చరించారు. మండలం లోని విత్తనముల లైసెన్స్‌లు కలిగి ఉన్న దుకాణములను వెంకటగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎం. నాగార్జున సాగర్, మండల వ్యవసాయాధికారి పి. సుజాత తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ప్రస్తుతం వెంకటగిరి మండలం నందు వరి రకములు ఎన్ఎల్ఆర్ 15048 రకము 488 క్వింటాళ్ళు, కేఎన్ఎం 1638 రకము 128 క్వింటాళ్ల విత్తనములు రైతులకు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే ఎక్కువగా రైతులకు విక్రయించినట్లైతే సదరు విత్తనాల వ్యాపారస్తులపై కఠిన చర్యలు తప్పవని, విత్తనముల లైసెన్సు ను రద్దు చేయడం జరుగుతుందని విత్తన డీలర్లను హెచ్చరించారు. డీలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## నాలుగురోజుల పాటు రైల్వేగేటు మూత

సూళ్లూరుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త

సూళ్లూరుపేట పట్టణం నడిబొడ్డులో ఉన్న ప్రధాన రైల్వేగేటును సోమవారం రాత్రి 8 గంటల నుంచి ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 12 గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే ఎస్ఎస్ఇ అధికారులు తెలిపారు. ఎల్‌సి60 రైల్వేగేటు మరమ్మతులతో పాటు గేటు వద్ద లైన్ల ఆధునికీకరణ, రిపేర్లు ఈ నాలుగురోజుల పాటు చేపట్టనున్నారు. ప్రజలు అసౌకర్యాన్ని మన్నించి సహకరించాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పాము కాటుకు విద్యార్థి మృతి



వాకాడు, నవంబర్ 4, ప్రభాతవార్త

చరణ్ అనే బాలుడిని సోమవారం పాము కాటుకు మృతి చెందాడు ఆ కుటుంబం కన్నీరు మున్నీరైయింది. కుటుం బీకులు వివరాలకు మేరకు వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చరణ్ అనే విద్యార్థి అదే గ్రామంలో ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్నాడు. అప్పుడు లాగే స్కూల్‌కి వెళ్లి వచ్చి తన ఇంట్లోనే రాత్రి పూజ నిద్రిస్తుండగా రాత్రి 12 గంటల సమయంలో కళ్ళు కనిపించడం లేదు కాలు నొప్పిగా ఉంది తల్లిదండ్రులకు చెప్పడంతో చరణ్‌ను బాలిరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఆ ఆసుపత్రిలో వైద్యాధికారి లేకపోవడంతో వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆ కుటుంబం కన్నీరు మున్నీరు అయ్యింది. వాకాడు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిరెడ్డి పాలెం గ్రామం శోక సముద్రంలో మునిగిపోయింది.

## తెదేపా సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

### - చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

రామకుప్పం/శాంతిపురం, నవంబర్ 4 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం కోరారు. సోమవారం రామకుప్పం, శాంతిపురం మండలాల్లో వారు పర్యటించారు. ఈసందర్భంగా పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశాల్లో ప్రసంగించారు. కుప్పం నియోజకవర్గాన్ని సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలపాలని ఎంపి దగ్గుమళ్ల పార్టీ శ్రేణులను కోరారు. వంద రూపాయల సభ్యత్వంతో కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయల భీమా సౌకర్యం కల్పిస్తున్న ఏకైక పార్టీ తెదేపానేనన్నారు. పార్టీలో నాయకులు విబేధాలు విడనాడి పనిచేయాలని ప్రతిపక్షం లేని చోట పార్టీ నేతలే కొంతమంది ప్రతిపక్షంగా మారడం తగదని ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పార్టీ శ్రేణులకు సూచించారు.

# తిరుపతి డివిజన్

# వినతులను సత్వరం పరిష్కరించండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 4 ప్రభాతవార్త : నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను సత్వరం పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశించారు. నగర పాలక సంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 38 వినతులు ప్రజలు సమర్పించారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు అర్జీలను కేటాయించారు. అన్ని అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, డిసిప మహోపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యాన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డిఈలు, ఏసిపిలు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.

**ప్రధాన, చిన్న వీధుల్లో ఎక్కడా గుంతలు లేకుండా పూడ్చాలి :**

నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన, చిన్న వీధుల్లో ఎక్కడా గుంతలు లేకుండా పూడ్చాలని కమిషనర్ ఎన్. మౌర్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రగంలో రోడ్లపై గుంతలు పూడ్చడం, గత వారం ప్రజల నుండి వచ్చిన వినతుల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై నగర పాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 15 లోపు నగరంలో అన్ని వీధుల్లో గుంతలు లేకుండా పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పలు చోట్ల ఇంజినీరింగ్ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజల నుండి వచ్చిన వినతులను ఏ మేరకు పరిష్కరించారని తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. అలాగే నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత బాగా చేపట్టాలన్నారు. నగరంలో అనదికారిక లేఔట్లు, భవన నిర్మాణాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, డిసిప మహోపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యాన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డిఈలు, ఏసిపిలు, శానిటరీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యత: స్వచ్ఛందంగా సేవ



శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి మాజీ సర్పంచ్ ప్రముఖ స్వచ్ఛందసేవలందిస్తూ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు తమ గ్రామం, చుట్టుపక్కల గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా శ్మశానానికి వెళ్ళు మార్గల్లో దారులను బాగు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో గున్నేరి శ్మశాన దారిని బాగు చేయించిన ఆయన సోమవారం చల్లపాళెం బిసి కాలనీ శ్మశాన వాటిక దుస్థితిని గుర్తించారు. రాబోయే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని దారిలోని ముళ్ళ పొదలను పిచ్చిమొక్కలను ప్రత్యేకంగా జెసిబిలను ఏర్పాటు చేసి శుభ్రపరచారు. దాంతో గ్రామస్థులు ఆయన సహాయానికి ధన్యవాదాలు తెలిపారు.

## బిసి నాయకుడు మృతికి సంతాపం



శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం బిసి కాలనీకి చెందిన పి.పృద్వి ఆకస్మికంగా మృత్యుపాలయ్యారు. ఆయన మృతికి సోమవారం మండల నాయకులు బొల్లినేని జగన్నాధం నాయుడు,తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామేశ్వర్‌యాదవ్‌లో ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున అందించే సహాయాలను అందిస్తామని భరోసా ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీకాళహస్తి నవంబర్ 4 ప్రభాతవార్త : ఏర్పేడు-వెంకటగిరి మార్గంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. తగ్గవోలు గ్రామానికి చెందిన తక్కలదూరి రమణయ్య(60) జీవాలు వ్యాపారాలు సాగించుకుంటూ ఈ ప్రాంతాల్లో నివాసముంటున్నారు. సోమవారం వేకువ జామున లేచిన ఆయన జీవాల్ని తీసుకొని చింతల పాళెం గ్రామానికి వెళుతుండగా రోడ్డు దాటే క్రమంలో వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణయ్య పయనిస్తున్న మోటార్‌సైకిల్ దెబ్బతిన్నది. రమణయ్య అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆర్‌టిసి డ్రైవర్ పరారీలో ఉన్నట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

## ఏడుగంగమ్మల అలయ కుంభాభిషేకానికి సన్నాహాలు

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడిలోని ఏడుగంగమ్మల ఆలయ ఆవరణలో అమ్మవారికి నిర్మించిన నూతన ఆలయ కుంబాభిషేకం ఈ నెల 7 నుంచి 8 వరకు నిర్వహించబడుతుందని కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి సోమవారం తెలిపారు. ఇక్కడ అమ్మవారికి సుమారు రూ.40లక్షలతో నూతన ఆలయం నిర్మించారు. వచ్చేనెల ఏడుగంగమ్మల జాతర నిర్వహించాల్సి ఉంది. ఏడుగురు అమ్మవార్లను ఇక్కడ నుంచి గ్రామోత్సవానికి ప్రారంభిస్తారు. కాబట్టి అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టాలని గతంలో నిర్ణయించి చేపట్టారు. ఈ నిర్మాణాన్ని పూర్తి చేసి కుంబాభిషేకానికి సిద్దం చేసారు. ఈ నెల 7,8వ తేదుల్లో కుంబాభిషేకం నిర్వహణకు సిద్దం చేసారని ఇఒ వివరించారు. 8వ తేది శుక్రవారం ఉదయం 9 నుంచి 10.30 గంటల లోపు ధనస్సు లగ్నంలో కుంబాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఇఒ వివరించారు.

## ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో నూతన ప్రెస్ క్లబ్ భవనాన్ని సోమవారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రారంభించారు. గతంలో ప్రస్తుతం ఏరియా ఆసుపత్రి వద్ద ఉన్న అన్నా క్యాంటిన్‌లో ప్రెస్‌క్లబ్ నిర్వహించే వారు. అయితే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నా క్యాంటిన్‌ను ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తిలోని మీడియా కోసం గతంలో కూరగాయల మార్కెట్ సమీపంలో మీ సేవ నిర్వహిస్తున్న భవనాన్ని ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు ఎంఎల్‌ఏ సూచించారు. ఈ మేరకు మున్సిపాలిటి సిద్ధం చేసారు. ఈ భవనాన్ని సోమవారం శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తికి గాయాలు

తొట్టంబేడు, నవంబర్ 4 ప్రభాతవార్త : మండలంలోని పెన్నలపాడు వద్ద ఇసుకట్రాక్టర్ డీకొన్ని ఓవ్యక్తి పక్కనే ఉన్న పంటపొలాల్లో పడడంతో ప్రమాదం తప్పింది. మండలంలోని పెన్నలపాడు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న శోభ భర్త వరదరాజులనాయుడు రోడ్డుపై వస్తుండగా ఇసుక ట్రాక్టర్లు వరుసగా అతివేగంగా వస్తుండడంతో ఓ ట్రాక్టర్ వరదరాజులనాయుడును డీకొనడంతో పక్కనే ఉన్న పంటపొలాల్లో పడడంతో ప్రమాదం తప్పింది. దీంతో గండం గడచిందంటూ హమయ్యా..అంటూ ఊపిరిపీల్చుకున్నారు. దీంతో గ్రామస్తులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇకనైనా ఈమార్గంలో ఇసుక ట్రాక్టర్ల వేగం తగ్గించుకుని వెళ్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు.

## మాజీ కౌన్సిలర్‌కు మధుసూధన్‌రెడ్డి పరామర్శ



శ్రీకాళహస్తి, నవంబర్ 4 ప్రభాతవార్త : మాజీ కౌన్సిలర్, మాజీ రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులు సిద్దులుగారి మురళీ అనారోగ్యం కారణంగా సోమవారం మాజీ ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి, మాజీ దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు సిరాజ్‌బాషా, గోరా, కంతా ఉదయ్ కుమార్, ఫతాన్ పరీద్, ఫజల్, బుల్లెట్ జయశ్యాం, గరికపాటి చంద్రశేఖర్ శ్రీవారి సురేష్, చింతామణి పాండు, ఉత్తరాజి శరవణకుమార్, విజయకుమార్‌రెడ్డి, గణేష్, అట్ల రమేష్, తీగల చిన్న, గణేష్, అప్పిని సుధాకర్, నరసింహులు, కిరణ్ యానాదయ్య తదితరులు పరామర్శించారు. తామున్నామంటూ భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండాలని మాజీ ఎంఎల్‌ఏ మధుసూధన్‌రెడ్డి మురళీకి సూచించారు.

## పనులు త్వరగా పూర్తిచేయించండి-ఎంపికి బిజెపి వినతి



తిరుపతి,నవంబర్ 4 ప్రభాతవార్త: తిరుపతినగర ప్రాధాన్యతతో నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ రైల్వేస్టేషన్ విస్తరణ, అధునాతన నిర్మాణాలను త్వనగా పూర్తి చేయించండని బిజెపి నేతలు ఎంపి సిఎం రమేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ఇక్కడకు వస్తున్న భక్తులు, యాత్రికులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సోమవారం సాయంత్రం తిరుపతి రైల్వేస్టేషన్ పనులను సందర్శించిన ఎంపి సిఎం రమేష్‌కు బిజెపి నేతలు గుండాలగోపీనాథరెడ్డి, కోలాఆనంద్, సుబ్రమణ్యం యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, నరేశ్ స్వాగతం పలికారు.

## పలు గ్రామాలలో విద్యుత్తు అంతరాయం : ఈఈ

తిరుచానూరు, నవంబర్ 4 ప్రభాతవార్త : తిరుపతి తూర్పు గ్రామీణ మండల పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం కలుగనుంది అని ఈఈ విన్నకోట చంద్రశేఖర్ రావ్ తెలియజేశారు. 33/11 కేవీ ఫీడర్ మంగళవారం ఉదయం నుండి మరమత్తులు చేపట్టనున్నారు. అదే క్రమంలో చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగనుంది. విప్పమాను పట్టెడ, సూరప్పకసం, బ్రాహ్మణపట్టు, పాటూరు, వినాయక నగర్, కొత్తూరు గ్రామాలలో మరమ్మత్తులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ మరమ్మతులు చేపట్టనున్న గ్రామాలలో విద్యుత్ అంతరాయాన్ని గమనించి గ్రామ ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 181 అర్జీలు

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 4 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చి అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కారం చూపాలని అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో జిల్లా కలెక్టర్ కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు నుండి వినతులు స్వీకరించారు. మొత్తం 181 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా నాణ్యతగా, అర్థవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరైన వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

## శివయ్య సేవలో మాజీ మంత్రి రోజా



శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి లో కార్తీక మాసం మొదటి సోమవారం అతిథుల తాకిడి పెరిగింది. సోమవారం సాయంత్రం మాజీ మంత్రి ఆర్‌కె రోజా కుటుంబ సభ్యులతో కలసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. ఆమెకు మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆమెకు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వచనాలు శేష వస్త్రాలను అందించారు. ఆమెకు స్వాగతం పలికిన వారిలో అంజూరు తారక శ్రీనివాసులతో పాటు శ్రీవారి సురేష్,ప్రసాద్, ఈశ్వర్‌సాయి, ముని తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యను దర్శించుకున్న మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీవీ



శ్రీకాళహస్తి, నవంబర్ 4 ప్రభాతవార్త : తొలి కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరున్ని మాజీ ఎంఎల్‌ఏ ఎస్సీవీనాయుడు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికి స్వామిఅమ్మవార్ల దర్శనం చేయించారు. కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైందని ఈమాసంలో శివయ్యను దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరున్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని మాజీ ఎంఎల్‌ఏ తెలిపారు. అనంతరం ఆయనకు శ్రీకాళహస్తీశ్వరుని కండువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందించారు. ఆయనతో పాటు గోగినేని భాస్కర్‌నాయుడు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్స్ రావడంతో వ్యక్తి మృతి!

నగరి, నవంబరు 4 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి పాండురాజపురం జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న ఎస్.కె.గోవర్ధన్ అలియాస్ నాగరాజు(44) స్థానిక పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ సమీపం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరీక్షించి విచారణ చేపట్టగా అతిగా మద్యం సేవించిన సమయంలో ఫిట్స్ రావడమే మృతికి కారణమని సీఐ మహేశ్వర్ వెల్లడించారు. మృతదేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు.

## బెల్టుషాపుపై దాడి - మహిళ అరెస్టు



నగరి, నవంబరు 4 ప్రభాతవార్త: మండలంలోని బుగ్గ అగ్రహారంలో బెల్టుషాపులు ఉన్నట్లు సమాచారం అందడంతో సోమవారం చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, సిబ్బంది దాడులు నిర్వహించారు. 53 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను ఉంచుకున్న వి.లక్ష్మి(58) అనే మహిళను అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం నగరి పోలీసులకు అప్పగించారు. తరచూ బెల్టుషాపులపై దాడులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సురేంద్ర, పీసీ గీత తదితరులు పాల్గొన్నారు.

## దొంగను అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

రేణిగుంట, నవంబరు 4 ప్రభాతవార్త: రేణిగుంట రైల్వే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బంగారు గొలుసు దొంగలించిన వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే ఎస్ఐ రవి ఇచ్చిన సమాచారం మేరకు...రేణిగుంట రైల్వే కోటర్స్‌లో ఉంటున్న రాజేశ్వరి(40) గురువారం రైల్వే నడకవంతనపై నడుచుకుంటూ ఇంటికి వెళుతుంది. వెనుక వైపు నుంచి ఓ వ్యక్తి ఆమె మెడలోని 16 గ్రాముల బంగారు గొలుసును తెంపుకుని పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదుచేయడంతో రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైల్వే పోలీసులు దొంగలించిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం తిరుపతి రైల్వే పోలీసు సహకారంతో నిందితుని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న 16 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నెల్లూరు రైల్వే కోర్టుకు తీసుకెళ్లారు. నిందితుడు 18 సంవత్సరాల లోపు బాలుడు కావడంతో అతని వివరాలను రైల్వే పోలీసులు గోప్యంగా ఉంచారు.

## శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వరునికి విశేష పూజలు



రేణిగుంట, నవంబరు 4 ప్రభాతవార్త: రేణిగుంట మండలం గాజులమండ్యంలో నిండుగా కొలువైన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయం సోమవారం కార్తీక మాస శోభ సంతరించుకుంది. కార్తీక మాసం మొదటి సోమవారం ఆలయంలో శ్రీ కామాక్షమ్మ తల్లికి, శ్రీ మూలస్థానేశ్వర స్వామికి ఆలయ నిర్వాహకుడు జువ్వల ధనంజయరెడ్డి ఆలయ పూజారి దక్షిణామూర్తి చేత విశేష పూజలు చేయించారు. శ్రీ మూలస్థానేశ్వర స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన విభూది, చందన, క్షీరం, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దేవిదేవేరులసేవలు, ధూపదీప నారికేళ ఫల పుష్పాది సమర్పణలు కన్నుల పండుగ జరిగాయి. నక్క మునెమ్మ దొరరాజు దంపతులు ఉభయ దాతలుగా ఆది దంపతులను సేవించుకున్నారు. భక్తులకు జువ్వల ధనంజయరెడ్డి, జగదీష్‌రెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో ఆడ పడుచులు ముత్తైదువులు కార్తీక దీపాలు దేవాలయ ప్రాంగణంలో వెలిగించితమ భక్తిప్రవత్తులను చాటుకున్నారు. రాత్రి పవలింపు సేవతో పురాణ దంపతులను నిద్రపుచ్చారు.

## యాచకులకు డబ్బు ఇవ్వద్దు : వెంకటాద్రి

రేణిగుంట, నవంబరు 4 ప్రభాతవార్త: యాచకులకు డబ్బులు ఇవ్వొద్దని బీజేపీ యువ నాయకుడు వెంకటాద్రి యాదవ్ అన్నారు. దేశంలో అనేక ప్రాంతాల్లో యాచకులు విపరీతంగా పెరిగిపోతున్నారన్నారు. యాచకులకు డబ్బులు వేసి వారిని సోమరులుగా తయారు చేయవద్దన్నారు. యాచించిన వారికి కడుపునిండా అన్నం పెట్టడం, అవసరమైతే బట్టలు ఇవ్వడం చేయాలన్నారు. అత్యవసర మందులు లాంటివి కొనడానికి డబ్బులు కావాలంటే దగ్గరుండి అలాంటి వారికి మందులు తీసి ఇవ్వాలి తప్ప డబ్బులు ఇవ్వడం మంచి పద్ధతి కాదన్నారు. కొంత మంది యాచించుకుని ఆ డబ్బుతో మద్యం సేవించడం, సిగరెట్లు తాగడం, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు.

## చైర్మన్ దృష్టికి సమస్యలను



రేణిగుంట, నవంబరు 4 ప్రభాతవార్త: సీఆర్ఎస్ యూనియన్ నేతలు సోమవారం తిరుపతి తాజ్ హోటల్‌లో పార్లమెంటరీ కమిటీ చైర్మన్ సీఎం రమేష్, సౌత్ సెంట్రల్ రైల్వేజనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, ఎంపీ గురుప్రసాద్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. సీఆర్ఎస్ ఉద్యోగులు, కార్మికులకు పది శాతం నుంచి 20 శాతానికి హెచ్ఆర్ఏ పెంచాలని, కొత్త కోటర్స్ నిర్మాణానికి, పాత కోర్టర్స్ మరమ్మతులకు, రైల్వే కళ్యాణ మండప నిర్మాణానికి, బడ్జెట్ కేటాయించడంతో పాటు, రైల్వే ఆస్పత్రిలో అన్ని విభాగాలకు వైద్యులను నియమించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మజ్దూర్ యూనియన్ సెక్రటరీ బాబు, చైర్మన్ సదాశివరెడ్డి, మునికుమార్, హెన్రి పాల్, ముని రాధయ్య, చంద్ర నాయక్, తిలక్, కుమార్‌రెడ్డి, గాండీవం తదితరులు ఉన్నారు.

## అవేర్నెస్ వీక్ సమాపన మహోత్సవం



తిరుపతి విద్య,నవంబర్ 4 ప్రభాతవార్త భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు గత వారం రోజులుగా జాతీయ సంస్కృత వర్సిటీ లో నిర్వహిస్తున్న విజిలెన్స్ అవర్నేస్ వీక్ కార్యక్రమ సమాపన సమారోహం సోమవారం విశ్వవిద్యాలయంలోని ప్రముఖ చెలికాని అన్నారావు సభా భవనం నందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి విజిలెన్స్ అవేర్నెస్ కార్యక్రమ ముఖ్యోద్దేశాన్ని వివరించారు. ఆయన మాట్లాడుతూ మన భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా నిర్మాణం చేయడమే ఈ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ లక్ష్యం. ప్రస్తుత కాలంలో ప్రతి చోటా అవినీతి అనేటువంటిది మహమ్మారిగా వ్యాపించిందని ఆ అవినీతిని మనం కూకటివేళ్లతో పెకిలించి, ఉత్తమ నీతియుక్త సమాజాన్ని స్థాపించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంస్కృతంలో ఎన్నో నీతి గ్రంధాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు నూతిక విలువలను ఏవైతే ఉన్నాయో వాటిని చక్కగా వివరించడం జరిగిందని తెలియజేశారు. అకాడమిక్ ప్రొ.రజనీకాంత్ శుక్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా నైతిక బాధ్యత కలిగి వారు చేసేటువంటి కార్యాలలో నిబద్ధత కలిగి ముందుకు వెళ్లినట్లయితే అవినీతికి ఆస్కారమే లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్ర పోషక యాజమాన్యాలపై ముగిసిన శిక్షణ



తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త: తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ స్థానం వేదికగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధికారులకు గత 15 రోజులుగా సమగ్ర పోషక యాజమాన్యాల పై ఇచ్చిన శిక్షణ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సుమతి మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం, కంపోస్ట్, వెర్మీకంపోస్ట్, జీవన ఎరువుల వాడకం పంటలకు సంబంధించి ఎలాంటి ఎరువులు వాడకం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చు అనే అంశాలపై సహకార సంఘాల అధికారులకు నిపుణులచే శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. శిక్షణ తీసుకున్న అధికారులు తమ ప్రాంతంలోని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న అధికారులకు సర్టిఫికెట్లను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో డైరెక్టర్ డాక్టర్ సంధ్యారాణి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఎస్ లక్ష్మీ డాక్టర్ వనజ, డాక్టర్ మధుమతి పాల్గొన్నారు.

## కేవీబీ పురం మండలంలో ఎమ్మెల్యే పర్యటన



కేవీబీ పురం, నవంబరు 4 ప్రభాతవార్త: తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు అన్న బీశాబత్తిని శ్రీనివాసులు నాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆయన కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే వగత్తూరు పంచాయతీలో అనారోగ్యంతో ఉన్న టీడీపీ సీనియర్ నాయకుడు దివంగత సర్పంచ్ భర్త పి.గోపాల్‌ని పరామర్శించారు. అలాగే పెరిందేశం గ్రామానికి చెందిన గౌతమి ఆదివారం శిల్పారామంలో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని మారుతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌతమి(18)ని పరామర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి తక్షణ సహాయంగా రూ.10 వేలు అందించి, అలాగే కలెక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## బడిఈడు పిల్లలు బడిలోనే చేర్పించాలి




కేవీబీ పురం, నవంబరు 4 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం కాట్రపల్లి ఎస్టీ కాలనీలో ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలు బడిలో చేర్పించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెంచురామిరెడ్డి, వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రతి పిల్లవాడు చదువుకోవాలని ఉద్దేశంతో ప్రతి ఇంటింటికి వెళ్లి బడిబయట ఉన్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య, విద్యకు సంబంధించి ప్రభుత్వం అందించే సౌకర్యాలపైన అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో విద్య ఆవశ్యకత తెలియజేస్తూ విద్య నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్టు మండల కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ చెంచురామిరెడ్డి, సిబ్బంది ఈశ్వరయ్య, గంగయ్య, ప్రధానోపాధ్యా యులు సుగుణ, ఏడబ్ల్యుసీ టీచర్ వరలక్ష్మి, అమరావతి, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచరు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి సమావేశంలో వారి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్




తిరుపతి హెల్త్, నవంబర్ 4 ప్రభాతవార్త : ఈ నెల 3వ తేదిన జరిగిన వైసిపి సమావేశంలో వారు మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఈ ఉమ్మడి చిత్తూరు జిల్లాకి ఎన్ని కంపెనీలు తీసుకొచ్చారు. ఎంత అభివృద్ధి చేశారని ప్రజలకు చెప్పాలి కానీ రాష్ట్ర నేతలు జగన్ రెడ్డికి ముఖ్య సలహాదారులు మాట్లాడుతారా అని అన్నారు. ఈ రాష్ట్రంలో ఎంత అభివృద్ధి చేస్తే ప్రజలు మీకు 11 సీట్లు ఇచ్చారనేది చిత్తశుద్ధితో పరిశీలన చేసుకోవాలి అని అన్నారు. తల్లి,చెల్లికి న్యాయం చేయ్యాలన్న దానిపై ఎవరో అక్కడ మాట్లాడ లేదు. బాబాయ్ హత్యపై ఎవరు ప్రస్తావించలేదు. టిటిడి నిధులకు కన్నం వేసినా వ్యక్తులుపై మాట్లాడేందుకు ఎవరికి కూడా నోరు రాలేదు. ఎంతసేపు కుప్పంలో గెలుస్తాం కుప్పంలో గెలుస్తాం అని జగన్‌రెడ్డి, పెద్దిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రోజా ముక్త కంఠంతో ఏ విధంగా డప్పు కొట్టుకున్నారో చూశామన్నారు. మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ పులిగోరు మురళి కృష్ణారెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ,పార్లమెంట్ కార్యదర్శి యశ్వంత్ రెడ్డి, రాజయ్య, మీడియా కోఆర్డినేటర్ చెంగయ్య, ఎస్సి నాయకులు వెంకటరత్నం, బిసి నాయకులు చిత్తూరు రవిశంకర్, గంధం బాబు తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR**
**O.E.P.No. 22 of 2020**
**O.S.No. 165 of 2016**
**Between:**
Smt P.Bhudevi ...Decree-Holder
**And:**
1)K.Chennakesavulu
2)Smt K.Dhayamma
....Judgement-debtors
**AUCTION NOTICE**
The schedule mentioned property is going to auction before the said court on **20-11-2024** in between **10-30 A.M to 5.00 P.M.** The intending bidders may participate in the auction on the said date and time before the said court.
**SCHEDULE**
Chittoor District- Chitoor Sub District- G.D.Nelloe Mandal- Peddakalva Revenue Village Accounts- Survey No.125-in this Plot No.19
Measuring: East- West: 50 feet
North-South: 20 feet,
Total:1000 Sq.feet or 111.11 Sq. yards Situated within the following boundaries:-
East: Common Road, West: Site of D.R.Prabhavathi, North: Site of T.Muniamma,South: site of N.H.Begum
**D.Hr Value : Rs.50,000/-**
**Amin's Value : Rs.6,50,000/-**
**Market Value : Rs.56,000/-**
**E.C : NIL**
**Sd/- C.SUBRAMANAYAM**
Counsel for Decree-Holder
Place: Chittoor, Date:04-11-2024

## పాఠశాలలకు కొత్త భవనాలు...అంగన్‌వాడి కేంద్రాల పెంపు

### -సర్వసభ్య సమావేశంలో ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు సాధిస్తామని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండల సర్వసభ్యసమావేశం ఎంపిపి పారి సంపూర్ణమ్మ అధ్యక్షతన జరిగింది. సభ్యుల సమస్యలకు ఎంపిడిఓ రఫీఖాన్ సమాధానాలు చెప్పారు. ఈ సర్వసభ్య సమావేశానికి అతిథిగా వచ్చిన శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అధికారులు సమస్యలను వివరించాలని కోరారు. దాంతో మండలంలోని పాఠశాలల పరిస్తితి ఆందోళన కరంగా ఉందని విద్యా శాఖకు చెందిన అధికారులు భువనేశ్వరి, బాలయ్యలు వివరించగా అలాంటి పాఠశాలలను గుర్తించి నివేదికలు తయారు చేయాలని మంత్రితో చర్చించి ప్రత్యేక నిధులు సాధించి కొత్త భవనాలు నిర్మిస్తామన్నారు. ఇక అంగన్ వాడి కేంద్రాలను పెంచాలని సిడిపిలో శాంతి దుర్గ కోరారు. 14 కేంద్రాలను పెంచాలని కోరగా ఉన్నతాధికారులతో చర్చించి అనుమతి సాధిస్తామన్నారు. పాఠశాల ఉపాధ్యాయురాలు పిల్లల్ని కొడుతున్నారని మద్దిలేడు గ్రామస్తులు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకురాగా ఎంఎల్‌ఏ స్పందించారు. అయితే విద్యాశాఖా ధికారి సమాధానం చెప్పారు. చుక్కల నిడిగల్లు, చల్లపాళెం గ్రామాలకు సంబంధించిన ప్రతినిధులు మాట్లాడుతూ మంచినీటి సమస్య చోటు చేసుకుందన్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు పగిలిపోయి ఇబ్బంది పడుతున్నామని వివరించగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎక్కడ సమస్య ఉందో గుర్తించి నివేదికలు తయారు చేస్తే ఉపముఖ్యమంత్రి నుంచి ప్రత్యేక నిధులు సాధిస్తామని ఎంఎల్‌ఏ సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి, తాటిపర్తి రవీంద్రరెడ్డి, బత్తిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న గ్రానైట్ లారీ : అంధకారంలో దుర్గరాజపురం

శ్రీరంగరాజపురం, నవంబరు 4 ప్రభాతవార్త : మండలంలోని అక్రమ గ్రానైట్ తరలింపునకు హద్దులు లేకుండా పోతోంది. దుర్గరాజపురం సమీపంలో గత నాలుగు నెలలుగా అనుమతులు లేని అక్రమ క్వారీ యథేచ్ఛగా జరుగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా ఒక రోజుకు 8నుంచి 10 గ్రానైట్ దిమ్మలు అతి వేగంగా తరలిస్తున్నారు. ఈ అక్రమ తరలింపులో ఆదివారం రాత్రి దాదాపు ఏడు గంటల సమయంలో వేగంగా క్వారీ నుంచి వస్తున్న రాయి ప్రభుత్వ పాథమిక పాఠశాల సమీపంలోని విద్యుత్ స్తంభాలకు ఢీకొంది. దీంతో మూడు లైన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒక స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో దుర్గరాజుపురం గ్రామం అంధకారంలో మునిగిపోయింది. ఒక దశలో స్తంభాన్ని ఢీకొన్న సమయంలో వచ్చిన పెద్ద శబ్దానికి గ్రామస్తులు ఉలిక్కిపడి... ఏం జరిగిందా అని బెంబేలెత్తిపోయారు. ఇదే లారీ గత నెల రోజుల క్రితం శ్రీరంగరాజపురం క్రాస్ వద్ద చిత్తూరు-పుత్తూరు రోడ్డులో మర్రిచెట్టు కొమ్మను ఢీకొనడంతో విద్యుత్ స్తంభం దెబ్బతింది. అలాగే బెంగళూరు వెళ్లేందుకు బస్ కోసం వేచి వున్న దుర్గరాజపురం గ్రామానికి చెందిన షణ్ముగం భార్య దివ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నాయకులు మంతనాలు చేసి సుమారు 5 లక్షల రూపాయల వరకూ క్వారీ యాజమాన్యంతో పరిహారం చెల్లించి గండం నుంచి బయటపడ్డారు. మండలం నుంచి అక్రమంగా రాత్రి పూట గ్రానైట్ లారీలు అతి వేగంగా వెళుతుండడంతో రోడ్డు పక్కన వున్న విద్యుత్ స్తంభాలు, బస్ కోసం ఎదురుచూస్తున్న మహిళలు గాయపడుతున్నా గనుల శాఖ అధికారులు గాని, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు గాని పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టించుకొనే వారు లేరనే ధీమాతో క్వారీ యాజమాన్యం విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు.



**విద్యుత్ శాఖ అత్యుత్సాహం:**

సాధారణంగా ప్రజల అవసరాల కోసం విద్యుత్ లైన్ వేసేందుకు అన్ని శాఖల నుంచి పత్రాలు తీసుకువస్తేనే లైన్ వేస్తామని అధికారులు చెబుతుంటారు. రశీదులు కట్టండి...లైన్ వేసేందుకు డబ్బులు చెల్లించండి... రిజిస్ట్రేషన్ లేదని వేధించే విద్యుత్ శాఖాధికారులు నెల రోజుల క్రితం మండల కేంద్రంలో గ్రానైట్ లారీ వల్ల దెబ్బతిన్న లైన్‌ను హడావుడిగా రాత్రికి రాత్రే పూర్తి చేశారు. మరమ్మతులు చేసి తెల్లవారే సరికి ఆనవాళ్లు లేకుండా చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి దుర్గరాజుపురం వద్ద దెబ్బ తిన్న విద్యుత్ స్తంభం, లైన్లను సోమవారం యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు.

## లేఅవుట్ వేస్తున్న యజమానులకు నోటీసులు

డక్కిలి, నవంబరు4 ప్రభాతవార్త; డక్కిలి మండలం లింగసముద్రం వద్ద అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్ యజమానులకు సోమవారం లింగసముద్రం పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి నోటీసులు జారీ చేశారు. గత కొన్ని రోజులు నుంచి లింగసముద్రం వద్ద కొంత మంది వెంకటగిరికి చెందిన బడాబాబులు ఎటువంటి అనుమతులు లేకుండానే దర్జాగా అక్రమ లేఅవుట్‌కు పనులు చేశారు. ఈవిషయం వెంకటగిరి ఎమ్మెల్యేకు దృష్టికి వెళ్లడం, ఉన్నతాధికారులకు తెలియడంతో సంబందిత రియల్ ఎస్టేట్ యజమానులకు నోటీసులు వెంటనే జారీ చేయాలని తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు లింగసముద్రం పంచాయితీ కార్యదర్శి వెంకటాద్రి రియల్ ఎస్టేట్ యజమానులకు నోటీసులు ఇచ్చారు. మూడు రోజుల్లోగా తగు ఆధారాలు చూపకపోతే లేఅవుట్ వద్ద ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని ఆనోటీసులో పేర్కొన్నారు.

## అధికార భాష హిందీ డైమండ్ జూబ్లీ వేడుకలు



శ్రీహరికోట (తడ), నవంబర్ 4 ప్రభాతవార్త : భారత అధికార భాష డైమండ్ జూబ్లీ ఇయర్‌గా జరుపుకుంటున్న నేపథ్యంలో అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటలోను తొలి కార్యక్రమాలు చేపట్టారు. ఈ సంవత్సరాన్ని డైమండ్ జూబ్లీ ఇయర్‌గా జరుపుకుంటున్న కారణంగా ఎస్‌డిఎస్‌సి షార్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమం జరిపారు. డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఈ కార్యక్రమాలు ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటిదాకా 1949 నుంచి ప్రతి సెప్టెంబర్ 14ను హిందీ డేగా జరుపుకుంటూ ఈ సంవత్సరానికి 75 సంవత్సరాలు పూర్తయ్యాయని ఈ సందర్భంగా చెప్పారు. సోమవారం డాక్టర్ బ్రహ్మప్రకాష్ హాల్లో జరిగిన కార్యక్రమంలో అంతకుముందు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు షార్ డైరెక్టర్, ఇతర శాస్త్రవేత్తలు బహుమతులు అందజేశారు. హిందీ మాగజైన్ ప్రజ్వల్-2024 సంచికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, పలువురు డిప్యూటీ డైరెక్టర్లు, ఇస్రో ఉద్యోగులు, స్టుడెంట్లు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో కార్తీక సోమవారం వేడుకలు



సూళ్లూరుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలో కార్తీక మాసం ప్రథమ సోమవారాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. అలాగే అభయ శంకర దేవస్థానంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేకువజాము నుంచే దేవస్థానాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

## దీపారాధనలతో మహిళల మొక్కులు



చంద్రగిరి, నవంబర్ 4 ప్రభాతవార్త: పవిత్ర కార్తీకమాసంలో శైవక్షేత్రాలలో కొలువుదీరిన శివయ్య తన దర్శన భాగ్యంతో భక్తులకు కను విందు గావించారు. కార్తీక మాసం, మొదటి సోమవారం ముక్కోటి అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం జరిపించారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో విశేష అలంకరణ గావించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా చంద్రగిరిలోని శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ ఆర్.శివకుమార్ శర్మ (శైవాగమ పండితులు) ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో విశేష అలంకరణ గావించి, భక్తులకు దర్శన సౌకర్యం కల్పించారు. మహిళలు సాయంత్రం శైవక్షేత్రాలలో మహిళలు దీపారాధనలతో మొక్కులు తీర్చుకున్నారు.

## మహారాజ అలంకారంలో స్కంధుడు



నగరి, నవంబరు 4 ప్రభాతవార్త: పట్టణ పరిధి కరకంతేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో స్కంధ షష్టి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి మహారాజ అలంకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పాలంకరణ ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ సుబ్రహ్మణ్య స్వామికి మహారాజ అలంకరణ చేసి భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. అలంకరణలు భక్తులను అమితంగా ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. హారతి పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రాహ్మణ సంఘం వారు భిల్వార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పాకాల, నవంబర్ 4, ప్రభాతవార్త : చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం ఊట్లవారిపల్లి సమీపాన ఆనందగిరిపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణేశ్వర స్వామి 54 అడుగుల విగ్రహం ప్రతిష్టించి నేటికి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజలు మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభి రెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 54 అడుగుల విగ్రహం ప్రతిష్టించి నాటి నుండి నేటి వరకు ప్రతిరోజు భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. 54 అడుగుల విగ్రహం ప్రతిష్టించి నేటికి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ యువరాణి, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, ఆలయ సిబ్బంది భాస్కర్, మణి, తదితరులు పాల్గొన్నారు.

## కపిలేశ్వర ఆలయంలో ముగిసిన గణపతిహోమం



తిరుపతి, నవంబర్ 4 ప్రభాతవార్త: పవిత్రమైన కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా కపిలేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులు జరిగిన గణపతిహోమం సోమవారం సాయంత్రం ముగిసింది. ఉదయం వేదోక్తంగా గణపతి హోమం ప్రారంభమైంది. కార్తీకమాసంతో ఆలయంలో నెలరోజులపాటు హోమమహోత్సవాలు నిర్వహిస్తారు. 16 నామాలతో గణపతిని స్తుతించారు. మహాపూర్ణాహుతి నిర్వహించారు.

## సిఎంను కలసిన టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం



కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు(టిటిడి) సభ్యుడిగా నియమితులైన వైద్యం శాంతారాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని సిఎం నివాసంలో ఆయనను వైద్యం శాంతారాం తన కుటుంబీకులతో కలసి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన తిరుమల శ్రీవారికి తాను సేవ చేసే భాగ్యం కల్పించడం పట్ల ముఖ్యమంత్రికి వైద్యం శాంతారాం ధన్యవాదాలు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రత కాపాడడంతో పాటు స్వామివారి విశిష్టతను మరింత చాటేలా తాను పనిచేస్తానని సిఎంకు వివరించారు. తనకు టిటిడి బోర్డు సభ్యుడిగా అవకాశ ం కల్పించిన సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు శాంతారాంకు మిఠాయిలు తినిపించారు. శాంతారాం పిల్లలు ఏం చదువుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు.

వార్త ప్రభావం

## ఏళ్ల తరబడిగా పనిచేస్తున్నాం..న్యాయం చేయాలి

### - ద్రవిడ వర్సిటీ విసిని కలసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు !!

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వవిద్యాలయంలో తాము ఏళ్ల తరబడి చిరుద్యోగులుగా పనిచేస్తున్నామని తమకు న్యాయం చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్‌లను కలిశారు. సోమవారం 'వార్త' మెయిన్ ఎడిషన్‌లో ప్రచురితమైన 'ద్రవిడ వర్సిటీ ఔట్ సోర్స్ ఉద్యోగుల భవిష్యత్తు డోలాయమానం'అనే కథనంను వర్సిటీ విసి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య దొరస్వామి మాట్లాడుతూ వర్సిటీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్న విషయం ప్రభుత్వం నియమించిన కమిటీ గుర్తించిందన్నారు. ఈ విషయంగా ప్రభుత్వానికి వారు తగు నివేదిక అందిస్తారన్నారు. మరో రెండు మూడు నెలల కాలంలో ప్రభుత్వం నివేదికను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటుందన్నారు. అందరికీ న్యాయం జరిగేలా తాము కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని తప్పక మంచి జరుగుతుందని ఉపకులపతి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు భరోసా కల్పి ంచడంతో వారు వెనుతిరిగారు.

## వాదుల చెరువును తవ్వేస్తున్నారు



శాంతిపురం, నవంబర్ 4 ప్రభాతవార్త : కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో మండల సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తుమ్మిశి వాదుల చెరువును అక్రమార్కులు విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. జెసిబిల సాయంతో పగలు రాత్రి తేడా లేకుండా చెరువులో ఉన్న మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే అధికార పార్టీ నేతల పేర్లు చెబుతున్నారు. ఇలా రోజూ మట్టిని తవ్వి గుంతలు చేస్తూ చెరువు రూపం మార్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. ఇప ్పటికే చెరువులో ఉన్న విద్యుత్ స్థంభాలు కూలే స్థితికి చేరాయి. చెరువుకు నీరు చేరితే ప్రజలు ప్రమాదం బారిన పడడం మాత్రం ఖాయం. అధికారులు స్పందించి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కుప్పం రైల్వే సమస్యలపై ఎంపి దగ్గుమళ్లకు వినతి



కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త : కుప్పం రైల్వే స్టేషన్, పరిసర రైల్వేస్టేషన్ల అభివృద్ధితో పాటు నెలకొన్న సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు మాజీ ఎంపిపి, తెదేపా ప్రొఫెషనల్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా॥ వెంకటేష్ వినతిపత్రం అందించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయానికి ఎంపి దగ్గుమళ్ల విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు డా॥ వెంకటేష్, స్థానిక దేశం నేతలు కలిశారు. కుప్పం ప్రాంతం మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న నేపథ్యంలో ఇక్కడకు కర్ణాటక, తమిళనాడునుంచి ప్రజలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారని ఈనేపథ్యంలో కుప్పంలో పలు రైళ్లకు స్టాపింగ్ కేటాయించేలా చూడాలని ఎంపి దగ్గుమళ్లను డా॥ వెంకటేష్ కోరారు. గోవా -వేలాంగణి, మధురై - బెంగళూరు, శివమొగ్గ -ఎంఎస్, దాదర్- పుదుచ్చేరి, ఎర్నాకుళం సూపర్‌ఫాస్ట్, వైజాగ్ - బెంగళూరు రైళ్లకు స్టాపింగ్ మంజూరు చేయించాలన్నారు. అలాగే కుప్పం నుంచి తిరిగే పుష్‌పుల్ రైలు సమయం మార్చాలని, అలాగే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును కుప్పం వరకు పొడిగించాలని కోరారు. ఈ స్టాపి ంగ్‌లు చేపడితే అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉంటుందన్నారు. దీనిపై ఎంపి దగ్గుమళ్ల సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు రవి, మహేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో ఉన్నత విద్యామండలి ఇంచార్జ్ చైర్మన్ సమీక్ష



తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఇంచార్జ్ చైర్మన్ ఆచార్య రామ్మోహన్ రావు సమీక్ష నిర్వహించారు. యస్వీయూ ఉపకులపతి కార్యాలయంలో ఇంచార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సమక్షంలో యస్వీయూ ఎన్.ఐ.ఆర్.ఎఫ్ ర్యాంకులు, పరిశోధన రంగంలో వృద్ధి అంశాల పై మాట్లాడారు ప్రపంచ స్థాయి ర్యాంకులు సాధించాలంటే పేటెంట్లు, ప్రపంచస్థాయి జర్నల్స్ లో ప్రచురణలు మెరుగుపరుచుకునేందుకు గల మార్గాలను సూచించారు. అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకునేందుకు యస్వీయూ చొరవ చూపాలని, పరిశోధనా రంగంలోవిదేశీ పరిశోధకుల బృందంతో కలసి పనిచేయాలని కోరారు. విశ్వవిద్యాలయ్యాల్లో పిజి, పిహెచ్.డి ప్రవేశాలకు సంబంధిత విశ్వవిద్యా లయాలే ప్రవేశపరీక్షలు, ప్రవేశాలు నిర్వహించేలా అనుమతించాలని విశ్వవిద్యాలయం అధికారులు కోరగా అందుకు సానుకూలంగా వున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్ల ఆచార్య సుధారాణి, ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్య ఆర్వీయస్ సత్య నారాయణ, ఆచార్య మోహన్‌రెడ్డి, డీన్లు ఆచార్య చంద్రాయుడు, ఆచార్య కిశోర్, ఆచార్య బాలాజీ, ఆచార్య నరసింహ, దామోదర రెడ్డి, టాస్క్ ఫోర్స్ మెంబర్లు ఆచార్య పద్మావతమ్మ, ఆచార్య భారతి, ఆచార్య రాజశేఖర్, మీడియా కో ఆర్డినేటర్ ఆచార్య పి.సి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వార్త ప్రభావం

## వి.కోట ఆర్టీసీ బస్టాండును పరిశీలించిన డిపో మేనేజర్



వి.కోట, నవంబర్ 4 ప్రభాతవార్త : వి.కోట ఆర్టీసీ బస్టాండును సోమవారం కుప్పం డిపో మేనేజర్ గోపీనాథ్ పరిశీలించారు. సోమవారం వార్తలో ప్రచురితమైన వి.కోట ఆర్టీసీ బస్టాండా.. అమ్మబాబోయ్ అనే కథనంపై ఆయన స్పందించారు. హోటళ్లనుంచి వ్యర్థాలను బస్టాండుకు దూరంగా పడేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే బస్టాండులో మరుగుదొడ్ల నిర్వహణదారులకు తగు సూచనలు ఇచ్చారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రయాణీకుల అవసరార్థం అవసరమైన కుర్చీలు ఏర్పాటుచేయిస్తామన్నారు. ప్రాంగణంలో సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండులో ఉన్న బోరును వినియోగంలో తెస్తామన్నారు.

## మాజీ మంత్రి రోజాపై కఠిన చర్యలు చేపట్టాలి

### -తెలుగు మహిళలు డిమాండ్



పుత్తూరు, నవంబరు 4 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి ఆర్.కె.రోజాపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్ నేతృత్వంలో సోమవారం తెలుగు మహిళలు పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీన తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో మాజీ మంత్రి రోజా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హోమ్ మంత్రి అనితలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టిడిపి నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు ఆడపిల్లల్ని రేప్ చేస్తుంటే, ముక్కలుగా నరుకుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, హోమ్ మంత్రి అనిత కేసులు పెట్టడం లేదని ఆరోపించారని తెలిపారు. టిడిపి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. అందువల్ల ఆమెపై కేసు పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో చిత్తూరు జిల్లా తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బసంతి, 17వ వార్డు కౌన్సిలర్ భువనేశ్వరి, తెలుగు మహిళలు నాగరత్నం, భారతి, మోహన, రజని, సంధ్యలు పాల్గొన్నారు.

## డిజిటల్ సహాయకులకు బిఎల్‌ఓ డ్యూటీలా..!

చిట్టమూరు, నవంబర్ 4 ప్రభాతవార్త: సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ సహాయకులకు బిఎల్‌ఓ డ్యూటీలు వేయడం వలన కార్యాలయ పనులు ఆగిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ సహాయకులు సుమారు 26 రకాల సేవలను ప్రజలకు అందించాల్సి ఉంది. కుల, ఆదాయ, ఆధార్, పెన్షన్లు, బర్త్, డెత్ వంటి సర్టిఫికెట్లతో పాటు పలు రకాల సేవలను నిత్యం ప్రజలకు అందించాల్సిన బాధ్యత వీరిపై ఉంది. కార్యాలయంలో ఎక్కువ పని ఒత్తిడి కలిగిన డిజిటల్ సహాయకులకు ఈ రకమైన అదనపు భారాన్ని పెట్టడం వలన కార్యాలయ పనులు నత్తనడకన సాగే పరిస్థితులు ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి డిజిటల్ సహాయకులకు బిఎల్‌ఓ డ్యూటీల నుంచి మినహాయింపు కల్పిస్తే ప్రజలకు సత్వర సేవలు సకాలంలో అందుతాయి. చిట్టమూరు మండలంలో ఈశ్వరవాక, మల్లాం, అరవపాలెం వంటి మేజర్ పంచాయతీల్లోని డిజిటల్ సహాయకులకు బిఎల్‌ఓ డ్యూటీలు వేసినట్లు తెలుస్తోంది.

## పరశురామేశ్వరునికి కార్తీక సోమవార అభిషేకాలు

శ్రీకాళహస్తి రూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం గుడిమల్లం ఆలయం లో వెలసిన పరశురామేశ్వరునికి సోమవారం ఉదయం రాహుకాల సమయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. పర్యాటక శాఖ పరిధిలోని దేవాలయం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అమలుకు నిధులను కేంద్రం నుంచి సాధించుటకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి ప్రత్యేక రోడ్డు సదుపాయాలను కల్పిస్తున్నారు. సోమవారం ఉదయం నిర్వహించిన అభిషేకాల్లో రైల్వేశాఖ డివైయస్‌పి హర్షిత, చిత్తూరు ఎస్‌పి మణికంత చందోల్‌లు హాజరయ్యారు. వారికి ఆలయ మర్యాదలతో, వేదమంత్రాలతో ఆలయ చైర్మెన్ బత్తలగిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి, పూజారులు స్వాగతం పలికారు. అభిషేకాలను తిలకించిన అధికారులు ఇలాంటి ఆలయానికి సంబంధించి మంచిగా ప్రచారం జరగాల్సి ఉందన్నారు. అభిషేక సేవల్లో పాల్గొన్న అధికారులకు స్వామివారి చిత్రపటాలను తీర్థ ప్రసాదాలను చైర్మెన్ అందించారు.

**15న కార్తీక పౌర్ణమి రోజులక్షబిల్వార్చన:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం శైవ క్షేత్రంగా విరాలజిల్లుతుంది. ఈ నేపథ్యంలో కార్తీక మాసం విశేషంగా శివాలయాల్లో దీపాలు వెలిగించుటకు మహిళలు ఉత్సాహం చూపుతారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికిలక్ష బిల్వార్చన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఇఓ రామచంద్రారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్తీక శుక్రవారం పౌర్ణమి రావటం అరుదని వివరించారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు : జిల్లా ఎస్పీ



తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 4 ప్రభాతవార్త : ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుండి సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి జిల్లా ఎస్పి 60 ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించి సకాలంలో విచారించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదులను కూడా ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణిస్తామని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు జిల్లా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు పరిపాలన, రావిమనోహరాచారి శాంతి భద్రతలు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా స్వామి అమ్మవార్ల ఉత్సవం



శ్రీకాళహస్తి, నవంబర్4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ఆలయంలోని అలంకార మండపంలో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి దేవస్థానం స్పష్టమైన ఆదేశాలు జారి చేసింది. ఊరంతా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు. అలాగే గోపురాలకు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు. స్వామి అమ్మవార్లను అలంకారమ ండపం వద్ద సప్పరాల్లో ప్రతిష్టించి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు, పోటు ఇన్‌చార్జి సురేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాద్ వెంటరాగా ఉత్సవం నాలుగుమాడావీధుల్లో సాగింది.



కార్తీమాసం మొదటి సోమవారం సందర్భంగా తిరుపతిలోని కపిలతీర్థం ఆలయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో తెలుగు రాష్ట్ర కార్యదర్శి వి. పుష్పావతి యాదవ్.

ప్రభాతవార్త, తిరుపతి



## కార్తీక సోమవారం పూజలు

నగరి, నవంబరు 4 ప్రభాతవార్త: మాజీ మంత్రి రోజా సోమవారం తన నివాసంలో కార్తీక సోమవారం పూజలు నిర్వహించారు. శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భిల్వార్చన పూజలు చేశారు.